నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 19 అక్టోబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## మహిళలు ఆర్థికంగా రాణించాలి



మాట్లాడుతున్న జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్

కన్నెపల్లి, అక్టోబర్ 18 : మహిళలు ఆర్థికంగా రాణించినప్పుడే వారి కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని మంచిర్యాల జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్ పేర్కొన్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఇటీవల వంద రోజుల కుట్టు శిక్షణ పొందిన వారికి పరీక్ష నిర్వహించారు. ఉత్తీర్ణులైన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారి సత్యనారాయణమూర్తి, ఎర్ర సువర్ణ, డీఆర్పీలు అశోక్‌రావు, జనార్దన్, వెంకటేశ్వర్లు, కన్నెపల్లి సెంటర్ నిర్వాహకురాలు శారద తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌ను కలిసిన మాజీ విప్ బాల్క సుమన్

చెన్నూర్, అక్టోబర్ 18: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను గజ్వేల్‌లోని ఎర్రవెల్లిలో ఆయన నివాసంలో బీఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుట్టిన రోజు సందర్భంగా బాల్క సుమన్‌ను కేసీఆర్ ఆశీర్వదించారు.



కేసీఆర్‌ను కలిసి మొక్కను అందజేస్తున్న బాల్క సుమన్



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకురాలు సరస్వతి

## వర్ధంతి సభను జయప్రదం చేయాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, అక్టోబర్ 18: 'జల్, జంగల్, జమీన్' కోసం పోరాడి అసువులు బాసిన కుమ్రం భీం జన్మస్థలం రౌటసంకేపల్లిలో ఈ నెల 22న నిర్వహించనున్న కుమ్రం భీం, ఎడ్ల కొండు వర్ధంతిని జయప్రదం చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పిలుపునిచ్చారు. శుక్రవారం గిరిజన సంఘాల నాయకులతో తన నివాసం వద్ద గిరిజన పోరాట యోధుల వర్ధంతి సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆదివాసీలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మర్సుకోల సరస్వతి, శ్రీనివాస్, కిష్టయ్య, ఆదివాసీ సంఘం నాయకులు ఆత్రం రాజు, పెందూరు సుధాకర్, సిడాం అర్జున్, మోతీరాం తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్, ఎమ్మెల్యే గడ్డం వినోద్

## కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

బెల్లంపల్లి, అక్టోబర్ 18 : వడ్ల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని చాకెపల్లిలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గడ్డం వినోద్‌తో కలిసి ఆయన ప్రా రంభించారు. కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రుణమాఫీ పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో రూ.3 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గడ్డం అశోక్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, నాయకులు మునిమంద రమేశ్, కంకటి శ్రీనివాస్, చిట్యాల మధు, పీక లక్ష్మణ్, పెద్దపల్లి రామస్వామి, బస్తీవాసులు పాల్గొన్నారు.

# పత్తి రైతుకు దిగులు

## కొనుగోలు కేంద్రాలు ఏర్పాట్లు చేయని సీసీఐ

- ప్రకృతి వైపరీత్యాలతో తగ్గిన దిగుబడి
- దళారులకు విక్రయిస్తే మరింత నష్టపోతామని ఆందోళన







పత్తి కొనుగోళ్ల ఏర్పాట్లకు నోచుకోని ఆసిఫాబాద్‌లోని మార్కెట్ యార్డు

కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): పంటలు చేతికి వస్తే రైతులకు ఆనందం కలుగుతుంది. కానీ జిల్లాలోని పత్తి రైతుల్లో మాత్రం ఆందోళన నెలకొన్నది. ఆరుగాలం శ్రమించి.. ప్రకృతి వైపరీత్యాలకు ఎదురేగి తీరా పంటలు చేతికి వచ్చే సమయానికి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఆలస్యంగా కొనుగోళ్లు ప్రారంభించడం...అప్పులు ఇచ్చిన వాళ్లు డబ్బులు అడగడంతో గత్యంతరం లేక రైతులు తాము కష్టపడి పండించిన పత్తిని దళారులకు విక్రయించడం జిల్లాలో సర్వసాధారణమైంది. జిల్లాలో ప్రతి ఏటా పెరుగుతున్న పత్తి విస్తీర్ణం ఈ ఏడాది 3.30 లక్షల ఎకరాలకు చేరింది. 29 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేసేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలవుతున్నది. జిల్లాలో పత్తి రైతుల పరిస్థితి దయనీయంగా మారుతున్నది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఆశించిన దిగుబడులు రావడం కష్టంగా మారింది. ఈ ఏడాది కురిసిన అధిక వర్షాలతో పూత, కాతపై తీవ్రమైన ప్రభావం పడింది. దిగుబడులు సరిగా రాకపోగా మరో వైపు చేతికొచ్చిన పంట మద్దతు ధర లభించకపోవడం, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు సీసీఐ ద్వారా కొనుగోలుకు సకాలంలో ఏర్పాట్లు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలతో ఇప్పటికే పత్తి పంటకు వాటిల్లిన నష్టానికి తోడు పెరిగిన పురుగుల మందులు, ఎరువుల ధరలు రైతులకు భారంగా మారాయి. ప్రభుత్వం 3.30 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు అంచనా వేసిన అధికారులు 23 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని భావిస్తున్నారు. సీసీఐ కొనుగోళ్లు ఆలస్యంగా ప్రారంభమవుతుండడం, గ్రామాల్లో దళారులు కొనుగోళ్లు ముందే ప్రారంభిస్తుండడంతో రైతులు గత్యంతరం లేక వ్యాపారులకే పత్తిని విక్రయించాల్సిన పరిస్థితి వస్తున్నది. జిల్లాలో ఆసిఫాబాద్‌తోపాటు జైనూర్ కాగజ్‌నగర్‌లో మార్కెట్ యార్డులు ఉన్నాయి. పత్తి కొనుగోళ్లకు కావాల్సిన ఏర్పాట్లను చేపట్టాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే వారం క్రితమే సమీక్షా సమావేశం నిర్వహించి పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్ యార్డులతో పాటు జిల్లాలో ఉన్న 17 జిన్నింగ్ మిల్లుల్లో పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని రైతులకు నష్టం కలగకుండా చూడాలని, దళారుల ప్రమేయం లేకుండా చేయాలని ఆదేశించారు. కాని సీసీఐ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. కనీసం మార్కెట్ యార్డు కాంటాలకు మరమ్మతులు చేసి సరి చేయడం లేదు. ప్రభుత్వం పత్తి క్వింటాల్‌కు ఈ ఏడాది రూ.7 521 మద్దతు ధర నిర్ణయించింది. దళారుల ప్రమేయం అధికంగా ఉండే ఆసిఫాబాద్ జిల్లాలో అధికారులు రైతులకు అవగాహన కల్పించి మార్కెట్‌యార్డులోనే పత్తి విక్రయించేలా ప్రోత్సహించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు గత్యంతరం లేక దళారులను ఆశ్రయించడమో లేక తమ గ్రామాల్లోకి వచ్చే వ్యాపారులకు పత్తి విక్రయించడమో చేస్తున్నారు. దీపావళి తర్వాత జిల్లాలో పత్తి ఏరడం ప్రారంభమవుతున్నది. ఆ లోపే అధికారులు మార్కెట్ యార్డుల్లో పత్తి కొనుగోళ్లకు సిద్ధం కావాలని అధికారులు పట్టించుకోకపోవడంతో గత్యంతరం లేక దళారులను ఆశ్రయించాల్సి వస్తున్నదని ఆవేదన చెందుతున్నారు.

### కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బంది పడుతున్నాం..



మాకు అందుబాటులో పత్తి కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బంది పడుతున్నాం. నేను 8 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. వర్షాలు అధికంగా కురవడంతో పత్తికి అనేక రకాల తెగుళ్లు వచ్చాయి. కలుపు ఖర్చు కూడా అధికమైంది. ఎకరానికి గతంలో 8 క్వింటాళ్ల వరకు వచ్చేది. ఇప్పుడు 5 నుంచి 6 క్వింటాళ్లు రావడం కష్టంగా ఉంది. పెట్టుబడి పెరిగేందుకు తోడు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు మాకు అందుబాటులో లేకపోవడంతో దళారులకు విక్రయించాల్సి వస్తున్నది.

*- మోహర్లే వెంకట్‌రావ్, బారెమోడి గ్రామం, కెరమెరి*

### దళారులకే విక్రయించాల్సి వస్తున్నది..



నేను మొత్తం 6 ఎకరాల్లో పత్తి సాగు చేశాను. నాకు ఎకరానికి 4 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చే అవకాశం ఉంది. అధిక వర్షాలతో పత్తి పంటకు చాలా వరకు నష్టం జరిగింది. మేము పత్తి విక్రయించాలంటే ఆసిఫాబాద్‌కు లేదా జైనూర్‌కు గాని వెళ్లాల్సి వస్తున్నది. 40 కిలోమీటర్ల దూరంలోని జిన్నింగ్ మిల్లులో పత్తిని తీసుకెళ్లి అమ్ముతున్నాం. మాకు వచ్చే కొద్ది పాటి దిగుబడికి అంతదూరం తీసుకువెళ్లాలంటే రవాణా ఖర్చులతో పాటు ఇబ్బందిగా మారింది. ఒక్కో సారి రెండు రోజులు కూడా అక్కడే ఉండాల్సి వస్తున్నది. అందుకని మా గ్రామాల్లోకి వచ్చే దళారులకే పత్తి అమ్మేస్తాం.

*- మడావి రమేశ్, కొలాం ఝరి గ్రామం, కెరమెరి*



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

## గూండాయిజం, గంజాయిని కట్టడి చేస్తున్నందుకే తన ఇంటిపై దాడి

### మంచిర్యాలపై ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 18: తన ఇంటిపై దాడి చేసి వాచ్‌మెన్‌పై దాడి చేసినంత మాత్రాన ఎవరికీ భయపడేది లేదని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 14న రాత్రి ముసుగులు ధరించిన ముగ్గురు దుండగులు తన ఇంట్లోకి చొరబడి వాచ్‌మెన్‌పై దాడి చేశారని తెలిపారు. మంచిర్యాలలో గంజాయి, గూండాయిజాన్ని నిర్మూలించడం అక్రమార్కులకు గిట్టడం లేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లో హంతకులను ఎలా ప్రోత్సహిస్తున్నారని ప్రశ్నించారు. దాడులు చేసి తనను భయపెట్టాలని చూస్తే సహించేదిలేదని హెచ్చరించారు. మీడియా మిత్రులు అభివృద్ధికి సహకరించాలని ఒకవేళ సహకరించకపోయినా అభివృద్ధి ఆగదన్నారు. మాతా శిశు దవాఖాన నిర్మాణం విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

### ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

కాగజ్‌నగర్, అక్టోబర్18: వరి ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని కాగజ్‌నగర్ మండలం వంజరి గ్రామంలోని రైతు వేదికలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పౌర సరఫరాల శాఖల అధికారులు, ఐకేపీ బ్యాంకు అధికారులతో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి 500 బోనస్ ఇస్తున్నందున, సన్న రకం, దొడ్డు రకం ధాన్యాలకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తేమ శాతం, తదితర నిబంధనలపై రైతులకు ముందస్తుగా అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు, తూకం యంత్రాలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. రైతులకు తాగునీరు, ఓఆర్ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, నీడ సౌకర్యం కల్పించాలని తెలిపారు. తూకం అయిన వెంటనే రైస్ మిల్లులకు తరలించి అన్‌లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ రావు, డీఎస్పీ రామానుజం, జిల్లా సహకార శాఖ అధికారి రబ్బాని, వ్యవసాయ, పౌరసరఫరాల, ఐకేపీ శాఖల అధికారులు, సిబ్బంది, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బెల్టుషాపులు@ రూ.7 లక్షలు !

జైపూర్, అక్టోబర్ 18: మండలంలోని కుందారం గ్రామంలో బెల్టుషాపులు నిర్వహించుకునేందుకు ఇటీవల వేలం పాట నిర్వహించినట్లు తెలిసింది. రూ.7 లక్షలు పాట పాడి 2 బెల్టుషాపులు దక్కించుకొని విక్రయిస్తున్నట్లు సమాచారం. సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో బెల్టుషాపులను బంద్ చేయాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఇలా వేలం పాటలు నిర్వహించడం గమనార్హం. ఇండ్ల మధ్యలో బెల్టుషాపుల నిర్వహణతో మహిళలు ఇబ్బంది పడుతున్నారని వాటిని ఎత్తివేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై తాము గ్రామ కమిటీకి తాము డబ్బులు కట్టామని ఎవరికీ భయపడేది లేదంటూ నిర్వాహకులు తెగేసి చెబుతున్నారని తెలిసింది.



కుందారం బెల్టుషాపులో మద్యం సేవిస్తున్న మద్యం ప్రియులు





రెబ్బెనలో ప్రచారం చేస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు

## సమస్యల పరిష్కారానికి కృషి

### పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు

రెబ్బెన, అక్టోబర్ 18: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గెలిపిస్తే ఉద్యోగుల సమస్యలతో పాటు ప్రైవేట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు అన్నారు. రెబ్బెన మండల కేంద్రంలోని పలు పాఠశాల్లో శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం ఇవ్వకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విడుతల వారీగా మంజూరు చేస్తేనే విద్యావ్యవస్థలు బాగుపడతాయన్నారు. ఉద్యోగుల రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ కోసం కృషి చేస్తానని, పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దపల్లి కిషన్‌రావు, జిల్లా అధ్యక్షుడు దేవభూషణం, ప్రధాన కార్యదర్శి తిరుపతిచారి, కోశాధికారి రాజేంద్రప్రసాద్, ట్రస్మా మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రావు, నాయకులు సురవర్ధన్, సుదర్శన్‌గౌడ్, ఇప్ప పోచయ్య, దీకొండ సంజీవ్, లక్ష్మణాచారి, మల్లిక్, తదితరులున్నారు.

## రాష్ట్రస్థాయిలో డ్రామా ఫెస్టివల్‌లో మూడో స్థానం

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 18 : హైదరాబాద్‌లో శుక్రవారం ఎస్సీఈఆర్టీ నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్ పోటీల్లో జిల్లా కేంద్రంలోని జనకాపూర్ జడ్పీ పాఠశాల విద్యార్థులు మూడోస్థానంలో నిలిచినట్లు హెచ్ఎం ఉదయ్ బాబు, జిల్లా సైన్స్ అధికారి మధూకర్ తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు 'కృతి మేధా-సమాజం' అంశంపై రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారన్నారు. డైరెక్టర్ రమేశ్, ప్రముఖుల చేతుల మీదుగా విద్యార్థులు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందుకున్నట్లు వివరించారు. గైడ్ టీచర్స్ రాజేశ్, ధర్మపురి వెంకటేశ్వర్లు విద్యార్థులను తీర్చిదిద్దారని తెలిపారు.



నెన్నెలలో చీరలు వద్దంటూ వెళ్లిపోతున్న మహిళలు

## ఈ చీరలు మాకొద్దు..

నెన్నెల, అక్టోబర్ 18: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బతుకమ్మ పండుగకు రెండేసి చీరలు ఇస్తామని చెప్పి పాత చీరలనే పంపిణీ చేస్తున్నారంటూ శుక్రవారం మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రంలో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. నెన్నెలలో బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్నట్లు ప్రచారం చేయడంతో మహిళలంతా పంపిణీ కేంద్రానికి వచ్చారు. ఆ చీరలన్నీ గత ప్రభుత్వం హయాంలోనివేనని గుర్తించి పాత చీరలు ఎలా పంపిణీ చేస్తారని అక్కడున్న అధికారులు, నాయకులను నిలదీశారు. మహిళలంటే ఇంత చులకనా అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మహిళలు ధ్వజమెత్తారు.

## గ్రూప్-2, 3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి
- వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్లు, అధికారులు

నస్పూర్, అక్టోబర్ 18 : రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న గ్రూప్ -2, 3 పరీక్షల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. పరీక్షల నిర్వహణపై శుక్రవారం హైదరాబాద్ లోని తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయం నుంచి ఇతర కమిషన్ సభ్యులు, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్-2 పరీక్షలు డిసెంబర్ 15, 16వ తేదీల్లో , గ్రూప్-3 పరీక్షలు నవంబర్ 17, 18వ తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారులు పరీక్షా కేంద్రాలు, స్ట్రాంగ్ రూములను గుర్తించి వసతులు, ఏర్పాట్లపై పూర్తి వివరాలతో నివేదికలు అందించాలన్నారు. అనంతరం మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ గ్రూప్ -2, 3 పరీక్షల కోసం జిల్లాలో 48 కేంద్రాలను ఏర్పాటు చేశామని, దాదాపు 15 వేల మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో తగిన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, పోలీసు నోడల్ అధికారి సుందర్‌రావు, ఆర్డీ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆసిఫాబాద్ కలెక్టరేట్ నుంచి..

ఆసిఫాబాద్ టౌన్, అక్టోబర్ 18 : టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివా రీ, దాసరి వేణు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-2, 3 పరీక్షల కోసం జిల్లాలు 18 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 4 500 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. కాగజ్‌నగర్‌లో 9 కేంద్రాలు, ఆసిఫాబాద్‌లో 9 కేంద్రాలు ఏర్పాటు చేసి, ఆయా పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులకు అసౌకర్యం కలుగకుండా తాగు నీరు, నిరంతర విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, డెస్క్ బెంచీలు, ప్రహరీ , ర్యాంపులు, ఇతర మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, అక్టోబర్ 18: త్వరలో జరగనున్న గ్రూప్-2, 3 పరీక్షల సంబంధిత ప్రశ్నాపత్రాలను భద్రపరిచేందుకు కలెక్టరేట్ లో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే తెలిపారు. శుక్రవారం స్ట్రాంగ్ రూమ్‌ను అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్, అదనపు ఎస్పీ, ఆర్డీవోతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖజానా అధికారి భానుమతి, ప్రాంతీయ సమన్వయకర్తలు లక్ష్మీ నరసింహ, రాజేశ్వర్ సిబ్బంది పాల్గొన్నారు.

### నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

కాగజ్‌నగర్, అక్టోబర్ 18: జిల్లాలో నిర్వహించనున్న గ్రూప్-2, 3 పరీక్షల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేయాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా అన్నారు. శుక్రవారం పట్టణంలోని వసుంధర డిగ్రీ కళాశాల, సెయింట్ క్లారెటి విద్యాలయం, ఫాతిమాకాన్వెంట్, సుప్రభాత్ విద్యాలయం, జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించనున్న గ్రూపు పరీక్షల ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్ కుమార్, తదితరులున్నారు.



వీసీలో పాల్గొన్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు



ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్